క్లుప్తంగా

అంకితభావంతో పని చేయడం అభినందనీయం



హోంగార్డు అంజయ్యను సన్మానిస్తున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: పోలీస్‌శాఖలో ఉద్యోగ విరమణ పొందినవారికి ఈ శాఖ అండగా ఉంటుందని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు అంజయ్యను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సన్మానించి మాట్లాడారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొందడం అభినందనీయమన్నారు. అనంతరం హోంగార్డు అంజయ్యను పోలీసు వాహనంలో ఎక్కించి బ్యాండ్‌మేళాతో ఘనంగా వీడ్కోలు పలికారు. ఆర్ఐ సైదులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: మొక్కజొన్న కనీస మద్దతు ధర కల్పించబడే విధంగా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అంచనాల జగిత్యాల జిల్లాలో 50వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసినట్లు తెలిపారు. మధ్య దళారులకు అడ్డుకట్ట వేసేలా ఖరీఫ్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం ప్రకటించిన రూ.2,400 మద్దతు ధరకు కొనుగోలు చేయాలని జీవన్‌రెడ్డి కోరారు.

తాటిపల్లి గురుకుల విద్యార్థుల ప్రతిభ



పోటీలకు ఎంపికైన గురుకుల విద్యార్థినులు

మల్యాల: మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి వాలీబాల్, ఖోఖో, కబడ్డీ ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ప్రతిభ కనబరిచి, ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు మనీష, రేవతి, సంజన, దర్శిని, అక్షిత, యశస్విని, హారికలను పీఈటీ మధులిక, ప్రిన్సిపాల్ మానస, ఉపాధ్యాయులు అభినందించారు.

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా



చెక్కులు అందిస్తున్న విద్యుత్ అధికారులు

కోరుట్ల: విద్యుదాఘాతంతో మృతి చెందిన రెండు కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా మంజూరు కాగా, విద్యుత్ అధికారులు మృతుల కుటుంబసభ్యులకు శుక్రవారం చెక్కులు అందించారు. పట్టణానికి చెందిన గృహ నిర్మాణ కూలీ షేక్ షఫీక్, మోహన్ రావుపేటకు చెందిన గుండవేణి రాజేందర్ విద్యుత్ షాక్‌తో మృతి చెందగా, బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున మంజూరైన చెక్కులను విద్యుత్ ఏడీ ఈ. రఘుపతి అందజేశారు. కార్యక్రమంలో కోరుట్ల టౌన్ ఏఈ శ్యామ్, మన్నెగుడెం ఏఈ అశోక్ , సబ్ ఇంజినీర్ దామోదర్, జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై శ్రీధర్‌రెడ్డి

మేడిపల్లి: మండలంలోని కట్లకుంట జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు క్రైం నేరాలు, గంజాయి, మత్తుపదార్థాలపై మేడిపల్లి మండల ఎస్సై శ్రీధర్ రెడ్డి శుక్రవారం అవగాహన కల్పించారు. నేరాలు, గంజాయి, మత్తు పదార్థాలతో కలిగే నష్టాలను తెలిపారు. వాటికి బానిసలైతే కుటుంబంతో పాటు సమాజంలో, ప్రభుత్వ కొలువుల్లో ఎదురయ్యే సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ప్రముఖులు పాల్గొన్నారు.

బస్టాండ్ నిరుపయోగం



నిరుపయోగంగా మారిన కొడిమ్యాల బస్టాండ్



రోడ్ల పైనే ఆపుతున్న బస్సులు

- బస్టాండ్ ఉన్నా లేనట్టే...
- నిర్వహణ లోపం
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- మరుగుదొడ్లు కరువు

కొడిమ్యాల: మండల కేంద్రంలోని బస్టాండ్ పట్టించుకునే వారులేక శిథిలావస్థకు చేరింది. ప్రయాణికుల సౌకర్యార్థం కోసం కొన్నేళ్ల క్రితం ఒక దాత భూమిని బస్టాండ్‌కోసం ఇవ్వగా, అధికారుల నిర్వహణ లోపం కారణంగా నేడు ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలతో నిండిపోయి యాచకులకు ఆవాసంగా మారింది. బస్సులు కూడా బస్టాండ్ బయటనే ఆగుతున్నాయి. బస్ కోసం ఎదురుచూసే ప్రయాణికులు ఎండైనా, వానైనా రోడ్డుపైనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అన్ని గ్రామాల ప్రజలకు వేరే గ్రామానికి పోవాలంటే ఇదే బస్టాండ్ కేంద్రంగా ఉండడం వల్ల జగిత్యాల నుంచి వేములవాడ వరకు ప్రతీ అరగంటకు ఒక బస్సు ఉండడం వలన ప్రయాణికులకు లోటు లేదు. కానీ ఆర్టీసీ అధికారులు ఈ సమస్యను పట్టించుకోకపోగా, రోడ్డుపైనే బస్సు ఆపి టికెట్ చెకింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. రాత్రి సమయాల్లో మందుబాబులకు అడ్డాగా మారింది. మరుగు దొడ్లు లేక మహిళ ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు .టికెట్ రేట్లు పెంచడంపై ఉన్న దృష్టి, కొంత మేరకు అయిన బస్టాండ్ల అభివృద్ధిపై పెట్టాలని ప్రయాణికులు అంటున్నారు. ఇదివరకు ఎన్నో ఫిర్యాదులు చేశామని ఆయన ఎటువంటి చర్యలు తీసుకోలేదని, ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని పరిసర గ్రామ ప్రాంత ప్రజలు,ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు.

రోడ్డుపైనే నిలబడుతున్న ప్రయాణికులు

ఏళ్లుగా బస్టాండ్ నిరుపయోగంగా ఉందని, గంటల తరబడి రోడ్డు పైనే నిలబడాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. మరుగు దొడ్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని, సంబంధిత అదికారులు స్పందించి బస్టాండ్ బాగు చేయించాలని కోరుతున్నారు.



కథలాపూర్: మండల కేంద్రంలోని రాళ్లవాగు ప్రాజెక్టు కుడికాలువలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో ప్రాజెక్టు నుంచి కాలువ ద్వారా నీళ్ల వదిలిన పిచ్చిమొక్కలు అడ్డుకావడంతో చివర వరకు నీరు రావడం కష్టమని రైతులు తెలిపారు. నీటిపారుదలశాఖ అధికారులు చొరవ చూపి రాళ్ల వాగు ప్రాజెక్టు కుడికాలువలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలను, చెట్లను తొలగించి చదును చేయించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
నిరంజన్, ఇరిగేషన్ డీఈ, సెల్ నంబర్: 8074092371

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ధాన్యం సేకరణకు సహకార సంఘాలు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లత

జగిత్యాల: ఖరీఫ్ సీజన్‌లో రికార్డుస్థాయి ధాన్యం సేకరణకు సహకార సంఘాలు సిద్ధంగా ఉండాలని అడిషనల్ కలెక్టర్ లత అన్నారు. శుక్రవారం సహకార సంఘాల సిబ్బందితో అడిషనల్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో జిల్లాను అగ్రగామిగా ఉన్న సహకార సంఘాల ధాన్యం కొనుగోలుకు తగు ఏర్పాట్లు చేసుకోవాలని, సన్న, దొడ్డురకాల ధాన్యం సేకరణకు వేర్వేరు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్, పౌరసరఫరాల అధికారి జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పరామర్శ

జగిత్యాల: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి తల్లి నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ నిజామాబాద్‌లో వారి స్వగృహంలో కలిసి పరామర్శించారు.

ఎల్‌వోసీ అందజేత

రాయికల్: మండలంలోని కట్కాపూర్ గ్రామానికి చెందిన తొగిటి లత కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, మాజీ సర్పంచ్ రాజమౌళి ఆరోగ్య పరిస్థితిపై ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే శనివారం హైదరాబాద్‌లోని నిమ్స్‌లో శస్త్రచికిత్స కోసం రూ.2.50 లక్షల ఎల్‌వోసీని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజమౌళి, రమేశ్, తిరుపతి పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితాన్ని నాశనం చేసుకోవద్దు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: డ్రగ్స్ బారిన పడి యువకులు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని పట్టణ సీఐ కరుణాకర్ అన్నారు. శుక్రవారం జగిత్యాల కొత్తబస్టాండ్‌లో నార్కోటిక్ డాగ్ బీడీ టీం సిబ్బందితో కలిసి నిత్యం రద్దీ ఉండే ప్రదేశాలలో చుట్టుపక్కల ప్రదేశాలలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. డ్రగ్స్ జోలికి ఎవరూ పోవద్దని, డ్రగ్స్ సరఫరా చేసే వారిపై నిత్యం దృష్టి పెడుతూ పట్టుకున్న వారిపై కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటున్నామన్నారు.

పౌష్టికాహారంతోనే ఎదుగుదల



ఒడ్డెలింగాపూర్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్

రాయికల్: పోషకాహార పదార్థాలతోనే చిన్నారుల్లో ఎదుగుదల ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. పోషణమాస వేడుకల్లో భాగంగా శుక్రవారం మండలంలోని ఒడ్డెలింగాపూర్, రాయికల్ పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషక పదార్థాలపై అవగాహన కల్పించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కథలాపూర్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యకరంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్రవంతి అన్నారు. శుక్రవారం కథలాపూర్ మండలం రాజారాంతండాలో పోషణ మాసం వేడుకలు నిర్వహించారు. పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సంధ్య, మహిళలు పాల్గొన్నారు.

పెగడపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర అన్నారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం జాతీయ పౌష్టికాహార మాసోత్సవం సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన, సామూహిక అక్షరభ్యాసం, గర్భిణులకు సీమంతాలు, గృహ సందర్శన కార్యక్రమాలు నిర్వహించారు. పౌష్టికాహారం విలువలు, ప్రయోజనాలు తదితర అంశాలపై తల్లులు, గర్భిణులు, కిషోర బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై ఫిర్యాదు



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

మేడిపల్లి: వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్‌పై కోరుట్ల బీజేపీ పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేశ్ సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం మేడిపల్లి, భీమారం మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు మేడిపల్లి మండల ఎస్సై శ్రీధర్ రెడ్డి ని కలిసి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్, ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్: సోషల్ మీడియాలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు ఎం.డీ అజీమ్, నారాయణరెడ్డి, ఎం.డీ హఫీజ్, రేహన్, పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

పెగడపల్లి: మండలంలోని కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు చెందిన నాయకులు బీజేపీ చేరారు. పెగడపల్లి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ తిరుమని రమణారెడ్డి, నామాపూర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బూత్కూరి మల్లేశం, మండల బీజేపీ అధ్యక్షుడు పల్లె మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిజమాబాద్ ఎంపీ అర్వింద్ సమక్షంలో బీజేపీలో చేరగా ఎంపీ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, మాజీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, నాయకులు రాగళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

మల్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మోతె శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి, పట్టుదలతో లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మోతె శివరామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శారీరక చికిత్స కన్నా మానసిక చికిత్స గొప్పది



మాట్లాడుతున్న డాక్టర్ అర్చన

జగిత్యాల: వైద్యులు అందించే శారీరక చికిత్స కన్నా మానసిక చికిత్స గొప్పదని నాన్ కమ్యూనికేబుల్ డిసెజెస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అర్చన అన్నారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని మాత శిశు సంక్షేమ కేంద్రంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం ప్రతి 10 మందిలో ఒకరు ఏదో ఒకరమైన మానసిక సమస్యలతో బాధపడుతున్నారని, కానీ వీరిలో కేవలం ఇద్దరికి మాత్రమే వైద్య చికిత్స అందుతుందన్నారు. ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి సమస్యలు పరిష్కరించేందుకు 14416 టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు చేసినట్లు, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణకుమారి, ఎన్‌సీడీ కో-ఆర్డినేటర్ మురళీధర్, శ్యామ్‌సుందర్, నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలుంటే తెలపాలి



నర్సింహునిపేటలో అధికారుల పొలంబాట

పెగడపల్లి: మండలంలోని నర్సింహునిపేటలో శుక్రవారం విద్యుత్ అధికారులు రైతులతో కలిసి పొలంబాట పట్టారు. దీనిలో భాగంగా గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్లు, ఏబీ స్విచ్‌లు, హెచ్‌జీ ఫ్యూసెట్లు, వేలాడుతున్న విద్యుత్ తీగలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ వెంకట్‌రెడ్డి రైతులతో మాట్లాడుతూ మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని, పొలాల చుట్టూ అక్రమ విద్యుత్ కంచెలు ఏర్పాటు చేసి ప్రమయాదాలకు గురికావొద్దన్నారు. విద్యుత్ పరంగా సమస్యలుంటే తమ సిబ్బందికి తెలియజేయాలని లేదా టోల్ ఫ్రీ నెంబరు 1912కు కాల్ చేయాలని సూచించారు. రైతులు పొలాల్లో ఉన్న సమయంలో విద్యుత్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఏఈ వెంకట్‌రెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేయాలి

జగిత్యాల: వార్డు ఆఫీసర్లు బాధ్యతగా పనిచేయాలని అదనపు కలెక్టర్ రాజాగౌడ్ అన్నారు. శుక్రవారం మున్సిపల్‌లో వార్డు ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్తి పన్ను వసూళ్లు అన్ని మున్సిపాలిటీలకన్నా తక్కువగా జగిత్యాల మున్సిపాలిటీ ఉందని, వార్డు ఆఫీసర్లు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వారి టార్గెట్‌ను వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు 27.46 శాతం మాత్రమే వసూలైందని, పూర్తిస్థాయిలో వసూలు చేయాలన్నారు. పారిశుధ్యం మెరుగుకుచర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ స్పందన పాల్గొన్నారు.

బీసీ సంఘాల నిరసన

పెగడపల్లి: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ జాతీయ బీసీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థల్లో ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్ అవకాశం చేజారకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, తిరుపతి, భాస్కర్, జలపతి, రామ్, కొమురెల్లి, రామచంద్రం, రాజశేఖర్, మలయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

జగిత్యాల: బీసీలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు రద్దు చేయడంతో బీసీలకు తీవ్రమైన నిరాశ ఏర్పడిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో బీసీ వర్గాల హక్కులు కోర్టులో నిలబడలేని స్థితి రావడం సిగ్గుచేటన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో బీసీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో గౌరవ ప్రధమైన స్థానం లభించిందన్నారు. బీసీ వర్గాల హక్కుల కోసం ఉద్యమం చేస్తామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: మండలంలోని పొరండ్ల సబ్‌స్టేషన్ పరిధిలోని పొరండ్ల, బాలపల్లి, కన్నాపూర్, కండ్లపల్లి, హన్మాజీపేట, పొలాస సబ్‌స్టేషన్ పరిధిలోని పొలాస, గుల్లపేట, అనంతారం రోడ్డాం, వ్యవసాయ కళాశాల, ఎక్స్‌ప్రెస్ ఫీడర్, హైదర్‌పల్లి గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఏఈ సుందర్ తెలిపారు.

మల్లాపూర్ : మండలంలోని కొత్తదాంరాజుపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని వాల్గొండ, తండా, పాతదాంరాజుపల్లి, సంగెం-శ్రీరాంపూర్, కొత్తదాంరాజుపల్లి గ్రామాల్లో, రాఘవపేట పరిధిలోని హుస్సేన్‌నగర్, రాఘవపేట, నడికుడ గ్రామాల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈలు వినీత్‌రెడ్డి, సంతోష్ తెలిపారు.

విద్యుత్ అంతరాయం

కొడిమ్యాల: కొడిమ్యాల సబ్‌స్టేషన్ పరిధిలోని కొడిమ్యాల,చింతలపల్లి,కొండాపూర్ గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ రఘునాథ్ తెలిపారు.

రాయికల్: పట్టణంతో పాటు, మండలంలోని మైతాపూర్, కుమ్మరిపల్లి గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఏఈ నవీన్ తెలిపారు.

మతిస్థిమితం లేని మహిళ తరలింపు

మల్యాల/మేడిపల్లి: మండల కేంద్రంలో మతిస్థిమితం లేని మహిళ కొంతకాలంగా ఉంటోందని, స్థానికులు సఖీ సెంటర్‌కు 181 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించగా, సఖీ సెంటర్ నిర్వాహకులు మహిళను తరలించారు. మేడిపల్లి మండలానికి చెందిన సుజాతగా గుర్తించి, అక్కడి అంగన్‌వాడీ టీచర్ సహాయంతో మహిళను మేడిపల్లి తరలించి, తల్లిదండ్రులకు అప్పగించారు.

సమాచార హక్కు చట్టంతో విప్లవాత్మక మార్పులు

జగిత్యాలఅగ్రికల్చర్: సమాచార హక్కు చట్టం ద్వారా పాలనలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని జిల్లా సహకార అధికారి సీహెచ్.మనోజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం సమాచార హక్కు చట్టం వారోత్సవాల సందర్భంగా జిల్లా కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యాలయ సూపరింటెండెంట్ ఎండీ అసద్, సిబ్బంది మల్లేశం, సాయికుమార్‌గౌడ్, సుజాత, నాగసంకీర్త, చైతన్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల పట్టివేత

కోరుట్ల రూరల్: మండలంలోని నాగులపేట శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు శుక్రవారం సాయంత్రం పట్టుకున్నారు. జగిత్యాల సీసీఎస్ పోలీసులు, కోరుట్ల పోలీసులు కలిసి పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని పట్టుకుని వారి వద్ద రూ.4460 నగదు, ఐదు సెల్ ఫోన్లు స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైతులు జాగ్రత్తగా ఉండాలి

గొల్లపల్లి: గ్రామాల్లో రైతులు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఆపరేషన్ ఏఈ రాకేశ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని గొల్లపల్లి సెక్షన్ పరిధిలోని అగిమల్లలో, అలాగే చిల్వాకోడూరు సెక్షన్ పరిధిలోని వెన్గుమట్లలో పొలంబాట నిర్వహించారు. . అన్ని వ్యవసాయ కనెక్షన్లకు క్యాపాసిటర్లు అమర్చుకోవాలని, తద్వారా విద్యుత్ సామర్థ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు ప్రవీణ్, మహేష్, రమణ, విద్యుత్ శాఖ కార్మికులు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలో పాము పిల్లలు ప్రత్యక్షం

మల్లాపూర్: పాఠశాల తరగతి గదిలో పాము పిల్లలు ప్రత్యక్షమైన సంఘటన మండలంలోని హుస్సేన్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండేందుకు వంట కార్మికులు తరగతిగదిలో నిల్వ ఉంచిన బియ్యం బస్తాల వద్దకి వెళ్లగా, రెండు కట్ల పాము పిల్లలు కదలాడుతూ కనిపించాయి. కార్మికులు ఆ పాము పిల్లలను చంపివేసి పాఠశాల బయట పడేయడంతో తృటిలో పెను ప్రమాదం తప్పినట్లయింది.

16న ఆలయాల హుండీ లెక్కింపు

కోరుట్లటౌన్: పట్టణంలోని పురాతన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం, కోరుట్ల మండలం వెంకటాపూర్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 16న మధ్యాహ్నం 1 గంటలకు హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. విక్రమ్ శుక్రవారం తెలిపారు.

విద్యార్థులు లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవాలి

జగిత్యాల: విద్యార్థులు లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని, వాటిని సాధించే దిశగా ప్రయత్నించాలని ఆర్కే విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ విభాగం విద్యార్థులకు స్వాగతోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన నిబద్ధతను ప్రదర్శిస్తే ఎలాంటి లక్ష్యాలైన సాధించవచ్చున్నారు.

గడ్డిమందు కలిపిన నీళ్లు తాగి గొర్రెలు మృతి

పెగడపల్లి: గడ్డి మందు కలిపిన నీళ్లు తాగి 6 గొర్రెలు మృతిచెందిన ఘటన మండలంలోని నామాపూర్‌లో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన దండవేని శంకర్ తన గొర్రెలను మేఘా క్యాంపులోకి వెళ్లాడు. క్యాంపు ఆవరణలో పెరిగిన గడ్డి నివారణ కోసం గడ్డి మందు స్ప్రే చేశారు. ఈ క్రమంలో గడ్డి మందు కలిపిన నీళ్లు బొకెట్‌లో నిల్వ ఉండటంతో వాటిని గొర్రెలు తాగాయి. తాగిన గొర్రెల్లో 6 మృతి చెందగా మరికొన్ని గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయని, మృతి చెందిన జీవాల విలువ రూ. 1 లక్ష వరకు ఉంటుందని, పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు శంకర్ కోరాడు.